క్లుప్తంగా

గజేంద్ర పుష్కరిణిలో మెట్లకు మరమ్మతులు



తాళ్లూరు గజేంద్ర పుష్కరిణిలో మెట్లకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న గజేంద్ర పుష్కరిణిలో మెట్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఏటా కార్తిక మాసంలో వేలాది మంది భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. నవంబర్‌లో కార్తిక మాసోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం మెట్లకు మరమ్మతులు చేయిస్తున్నట్టు మఠం అర్చకులు తెలిపారు.

ఓటే వజ్రాయుధం



శంఖవరంలో బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

శంఖవరం: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, బీఎల్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 తేదీ వరకూ కొత్త ఓట్ల నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే చేసి ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

బలరామపురం సర్పంచ్ మృతి



సన్యాసి (తాతాజీ)

రౌతులపూడి: మండలంలోని బలరామపురం సర్పంచ్ దాసరి సన్యాసి (తాతాజీ) (36) శనివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం సర్పంచ్‌గా కొనసాగుతున్న ఆయన గత స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలుపొందారు. పార్టీకి కీలక నేతగా ఉన్న ఆయన గ్రామానికి ఎనలేని సేవలందించారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతిడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఉచిత రక్తదాన శిబిరం



తునిలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: యువత రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తుని పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. స్థానిక పోలీసులతో పాటు పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్‌కు అందజేస్తామని తుని ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్, డాక్టర్ స్వప్న తెలిపారు. వైఎస్సార్ సీపీ యువిజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కౌన్సిలర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి నవ వధువు ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: భవనం పైనుంచి దూకి ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన విజయలక్ష్మి (19)కి జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన అనిల్‌కుమార్‌తో నెల క్రితం వివాహమైంది. అనిల్‌కుమార్ విశాఖపట్టణంలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ భార్యతో కలిసి అక్కడే ఉంటున్నారు. దసరా పండుగకు కొత్త జంట జంగారెడ్డిగూడెం వచ్చారు. అనిల్‌కుమార్ ఇల్లు పట్టణంలోని ఏలూరు రోడ్‌లోని కేపీ టవర్స్ వెనుక ఉండగా, ఏమైందో ఏమో తెలియదు గాని శనివారం విజయలక్ష్మి కేపీ టవర్స్‌పైకి ఎక్కి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చ్యూరీకి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు వస్తేనే గాని మృతికి కారణాలు తెలియవని, ఫిర్యాదు అందిన తరువాత కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



తాళ్లూరులో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న నాయకులు



శరభవరంలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



చిల్లంగిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పేదలకూ కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

జగ్గంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లోని పేదలకూ కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మల్లిపాకలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, రోగులకు మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బందారు రాజా, గ్రామ సర్పంచ్ జగతం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



మల్లిపాకలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

పేదలకు ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం

గోకవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని అచ్యుతాపురంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్లుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ బత్తుల శ్రీను, ఎంపీటీసీ కొత్తపల్లి చిన్ని, ఆకుల సత్యనారాయణ, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండలంలోని శరభవరంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు మురళీమోహన్‌రెడ్డి, శివకృష్ణ, సాహితి, జ్యోతిర్మయి, ప్రేమ్ కుమార్, యశస్వి 480 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చిన బాబు, పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, పార్టీ యూత్ లీడర్ రామిశెట్టి బులి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ అమరాది వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు నిరంతరం కొనసాగుతాయని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని తాళ్లూరులో శనివారం జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఎంపీపీ రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, కో ఆప్షన్ సభ్యుడు షేక్ సుబానీ, నాయకుడు తమరాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే మెరుగైన వైద్యం

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందుతోందని చిల్లంగి సర్పంచ్ మహేంద్రాడ శ్రీలిత, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి అన్నారు. మండలంలోని చిల్లంగి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్యులు కె.సాయిహేమాంజలి, కె.సంతోష్, జి.నీరజ, జేవీ కిరణ్ చౌదరి, ప్రియాంక, ఎ.శాంతిరంజని సుమారు 415 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడారి గంగబాబు, పీలా లోవ సుబ్రహ్మణ్యం, సంఘన వెంకటేశ్వరరావు, నైదాన రఘు, బిళ్లకుర్తి శివాజీ, మొల్లేటి వీరబాబు పాల్గొన్నారు.

సురక్షతో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు



ఆనూరులో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ గంగబాబు

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ అయ్యాయని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. పైడికొండ పంచాయతీ ఆనూరులో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు సుమారు 350 మందికి పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు నాయకులు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పసుపులేటి సతీష్, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, అంగుళూరి సుశీల, దడాల విజయ్, సర్పంచ్ నరిశే దుర్గ, నరిశే తాతయ్యలు, కాశిందేవుల శ్రీనివాస్, రెడ్నంశెట్టి త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎంపీపీ లగుడు శ్రీనివాసు
- కోటనందూరులో వై ఏపీ నీడ్స్ జగన్

కోటనందూరు: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు అధ్యక్షతన శనివారం ఏపీకి జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాలకు మంచి చేసే సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కాకపోతే రాష్ట్రం అథోగతి పాలయ్యే ప్రమాదం ఉందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా ముందుకెళ్తున్న సీఎం జగన్‌పై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వాటిపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. గతంలో జరిగిన దోపిడీ పాలనకు, ప్రస్తుత సంక్షేమం, సుపరిపాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రానికి, తుని నియోజకవర్గానికి మంచి చేసే సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజాల విజయమే లక్ష్యంగా విబేధాలు, ఆదిపత్య పోరులను పక్కనపెట్టి సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు మండల స్థాయి నాయకులు గ్రామాల్లో పర్యటించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించడం, పార్టీ జెండా ఆవిష్కరణ, ప్రజలతో మమేకం, రాత్రి బస వంటి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి గోవిందు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, ఏఎంసీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, కో ఆప్షన్ మెంబర్ జిగటాల కోటసత్తిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

సత్యదేవుని ఆలయం మూసివేత

అన్నవరం: చంద్ర గ్రహణం సందర్భంగా అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని శనివారం మూసి వేశారు. సాయంత్రం 5 గంటలకు అర్చకులు స్వామివారికి పూజలు చేసి ఆలయ తలుపులు మూసివేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోకి రాకుండా తూర్పు, పశ్చిమ రాజ గోపురాల తలుపులు కూడా మూసి వేశారు. అలాగే రత్నగిరిపై రామాలయం, వనదుర్గ, కనకదుర్గ ఆలయాలను మూసివేశారు. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం నాలుగు గంటలు లోపు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ చేస్తామని ఆలయ ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

తలుపులమ్మ ఆలయం మూసివేత

తుని రూరల్: చంద్ర గ్రహణం సందర్భంగా లోవ దేవస్థానంలోని తలుపులమ్మ అమ్మవారి ఆలయాన్ని శనివారం మూసి వేశారు. పండితులు సాయంత్రం 5 గంటలకు కవాటబంధనం చేశారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఆలయాన్ని తెరుస్తామన్నారు. సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు.



లోవదేవస్థానంలో తలుపులమ్మతల్లి ఆలయాన్ని మూసి వేస్తున్న అర్చకులు

అనూష యాదవ్‌కు డాక్టరేట్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన దేవర అనూష యాదవ్‌కు డాక్టరేట్ లభించింది. పాండిచ్చేరిలోని పీపుల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ సంస్థ ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన సోషల్ లీడర్స్‌కు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. సోషల్ సర్వీస్ విభాగంలో అనూషయాదవ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆమెను సినీ నటులు లక్ష్మీనారాయణ, విజయ మోహన్ తదితరులు అభినందించారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



పమాణస్వీకారం చేసిన ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

గోకవరం: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శనివారం ఘనంగా జరిగింది. వీరలంకపల్లిలోని రామకృష్ణాగార్డెన్స్‌లో సంఘ గౌరవాధ్యక్షులుగా బాలు, గంధం బుజ్జి, గౌరవ సలహాదారులుగా తోలేటి రాంప్రసాద్, పల్లెల కొండలరావు, మండలాధ్యక్షుడిగా నన్నపు శాంతిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా శివ, సెక్రటరీగా చిన్న లావయ్య, ట్రెజరర్‌గా దుర్గ, జాయింట్ సెక్రటరీగా రతనరాజు ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శాంతిబాబు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని: వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తుని ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ స్వప్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్ గ్రేడ్ 1, గ్రేడ్ 2, ఆడియోమెట్రీషన్-1, ల్యాబ్ అకౌంటెంట్-1 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు



ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, వేదపండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ప్రయాగ రాంబాబు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

గండేపల్లి: పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. లలితాదేవి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పండితులు అమ్మవారికి చండీ హోమం, రుద్ర, నవగ్రహ హోమాలు చేశారు. తాళ్లూరు జీయన్న మఠంలో భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు.

వైభవంగా సుదర్శన హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా సురద్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి

ప్రత్తిపాడు: యువత రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్ బాబు పిలుపు నిచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పోలీసులతో పాటు సుమారు 55 మంది రక్తదానం చేశారు. స్థానిక సీహెచ్‌సీ, కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ నమోదు జాబితాలు

ఏలేశ్వరం: రైతులు ఈ-క్రాప్ నమోదు జాబితాలను సరిచూసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, మండల కో ఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని తిరుమాలి ఆర్‌బీకేలో శనివారం ఈ-క్రాప్ నమోదు జాబితాను ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు చేసిందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈ క్రాప్ నమోదు జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 30 లోగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమాలిలో ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న మండల కో ఆప్షన్ సభ్యుడు నాగేశ్వరరావు

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సాధారణ, ప్రత్యేక సమావేశాలు చైర్‌పర్సన్ సుధారాణి అధ్యక్షతన జరిగాయి. సాధారణ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 31 అంశాలు, ప్రత్యేక సమావేశంలో రెండు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పట్టణాభివృద్ధికి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. పట్టణంలో జరుగుతున్న శానిటేషన్ పనులను కౌన్సిలర్లు పర్యవేక్షించి, లోటు పాట్లు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, కమిషనర్ ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, కౌన్సిలర్లు, వివిధశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

వాల్మీకి జయంతి వేడుకలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామాయణం రచించిన వాల్మీకిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు, సజ్జా సత్యనారాయణ, ఉడతల రమణారావు, శిడగం రామకృష్ణ, పాపారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో...

గోకవరం: రామాయణ గ్రంథకర్త వాల్మీకి మహర్షి జయంతిని శనివారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. దేవీచౌక్ ఆలయ ప్రాంగణంలో వాల్మీకి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యుడు వరసాల ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణ మహాగ్రంథాన్ని రచించారన్నారు. ప్రతిఒక్కరూ ఈ గ్రంథాన్ని పఠించడం ద్వారా ఆదర్శ కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఇనకోటి బాపన్నదొర, మంగరౌతు శ్రీను, ఇనకోటి పెద్దులు, ఆచంట రాజు, పులపర్తి బుజ్జి పాల్గొన్నారు.



గోకవరంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవీచౌక్ ఉత్సవ కమిటీ సభ్యులు

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శనివారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి. అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి, తామరాడ గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గెద్దనాపల్లికి చెందిన సుందరపల్లి శ్రీనుపై పరారీ కేసు నమోదు చేశారు. తామరాడలో చక్రవర్తుల గోపాలస్వామిని అదుపులోకి తీసుకున్నారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో 10 లీటర్ల సారాతో ఒనం లోవరాజును అరెస్టు చేసినట్టు సీఐ వివరించారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సందర్శించారు. పాఠశాలలోని టాబ్, లాబ్‌ల వినియోగంపై విద్యార్థులను ఆరా తీశారు. ఎంత సేపు వినియోగిస్తున్నారు, టాబ్, లాబ్ వల్ల ఉపయోగం తదితర విషయాలపై ఆయన విద్యార్థులతో చర్చించారు. ఆపై కొన్ని ప్రశ్నలు సంధించారు. విద్యార్థుల నుంచి స్పష్టమైన సమాధానాలు రావడంతో సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, ప్రధానోపాధ్యాయుడు టీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.